TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU


తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

www.telanganamuchatlu.in


వరంగల్ సంపుటి : 2 సంచిక : 34 గురువారం 17 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in



# స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్లో భగ్గుమన్న వర్గపోరు





- -ఇందిరమ్మ కమిటీలు పెట్టిన చిచ్చు
- -కడియం తీరుపై ఇందిరా వర్గీయుల ఆగ్రహం
- -ఏక పక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలపై అభ్యంతరం
- -రోడ్డెక్కి నిరసన తెలిపిన కరుడుకట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ కాంగ్రెస్ లో వర్గ పోరు భగ్గుమంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాల పై ఇందిరా వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం ధర్మసాగర్ మండలానికి చెందిన పలుగ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు హైదర్ బాద్ హన్మకొండ జాతీయ రహదారిపై రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. నియోజక పరిధిలోని జాఫర్ ఘడ్ మండలంలోను పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. 2లో

# రికార్డు స్థాయిలో ప్రభుత్వం అప్పులు



- ♦ రేవంత్ తెచ్చిన అప్పు 10 నెలల్లో రూ.80,500 కోట్లు
- ♦ ఇంత అప్పులు తెచ్చి దేనికి ఖర్చు చేశారు?
- ♦ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, (అక్టోబర్ 16) : రేవంత్ రెడ్డి గద్దె నెక్కిన రోజు నుంచి పది నెలల్లో రూ.80,500 కోట్ల అప్పు తెచ్చారని, రికార్డు స్థాయిలో అప్పులు తెచ్చి దేనికి ఖర్చు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. అప్పు చేయడమే తప్పు అన్నోళ్లను ఇప్పుడు దేనితో కొట్టాలని ప్రశ్నించారు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కట్టలేదని.. ఎన్నికల హామీలు నెరవేర్చలేదని.. అలాంటప్పుడు అప్పు తెచ్చిన రూ.80 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకు ఆ మొత్తం ధారాదత్తం చేశారా? కమీషన్లకు కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులతో ప్రాజెక్టులు నిర్మించామని, ప్రతి పైసా మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేశామన్నారు. తెచ్చిన అప్పులతో దశాబ్దాల కష్టాలు తీర్చామన్నారు. రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా ఇవ్వకుండా.. ఒక్క ప్రాజెక్టు కట్టకుండా.. నెలల పాటు జీతాలు 2లో

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

- ➤ రబీ సీజన్లో పంటల కనీస మద్దతు ధర పెంపు
- ➤ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, (అక్టోబర్ 16) : మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి

మిగతా 2లో...

# అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు?

**మీ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు**
**మంత్రి కేటీఆర్ ఆరోపణలకు మంత్రి సీతక్క కౌంటర్**




హైదరాబాద్, (అక్టోబర్ 16) : పదేళ్ల పాలనలో లక్షల కోట్ల అప్పులు చేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టుల పేరుతో అందినకాడికి అప్పులు తీసుకున్నారు. ఈ లెక్కలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బయటపెట్టింది. అసెంబ్లీ సాక్షిగా అన్ని వివరాలను ప్రజల ముందు ఉంచింది. అధిక అప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో కూడా వివరించింది. అయినా కూడా తాము మ్యానేజ్ చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేసింది. అయితే, 10 నెలల కాంగ్రెస్ పాలనలో రూ.80వేల కోట్లకు పైగా అప్పులు చేసినట్టు మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. దీనికి మంత్రి సీతక్క కౌంటర్ ఇవ్వడంతో రాష్ట్ర అప్పులపై మరో సారి చర్చ జరుగుతోంది. రేవంత్ కుర్చీ ఎక్కిన రోజు నుండి తెచ్చిన మొత్తం అప్పు లు 80,500 కోట్లు అని, 10 నెలల్లో ఇదో రికార్డ్ అని విమర్శించారు కేటీఆర్. అప్పు తప్పు అన్నోళ్లని ఇప్పు డు దేనితో కొట్టాలని సెటైర్లు వేశా రు."ఎన్నికల హామీలేవీ తీర్చలేదు.ఏకొత్తసాగునీటి ప్రాజెక్టుకట్టలేదు.మరిముఖ్య మంత్రి తెస్తున్న అప్పు 2లో

వైసీపీ నేత

# సజ్జలకు బిగ్ షాక్

## ఆ కేసులో నోటీసులు జారీ



అమరావతి (అక్టోబర్ 16) : టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో గుంటూరు జిల్లా మంగళగిరి పోలీసులు దూకుడు పెంచారు. వైసీపీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. 2021లో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఆయనకు మంగళగిరి గ్రామీణ పోలీసులు నోటీసులు ఇచ్చారు. గురువారం ఉదయం 10:30గంటలకు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. విచారణ నిమిత్తం మంగిళగిరి పోలీస్ స్టేషన్కు రావాలని నోటీసులో తెలిపారు. 2021 అక్టోబర్ 19న అప్పటి వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిన ఆ పార్టీకి చెందిన మూకలు టీడీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఫర్నిచర్, కార్లు, అద్దాలు ధ్వంసం చేసి వీరంగం సృష్టించారు. ఈ ఘటనపై ఇప్పటికే పలువురు వైసీపీ నేతలను విచారించగా.. తాజాగా సజ్జలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు ఈ కేసులో కీలక నిందితుడు వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, ఆ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

మిగతా 2లో...


# గుండు సున్నా

## చేసిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (అక్టోబర్ 16) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు మరో సారి మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్లో హరీశ్ రావు ఇష్టాగోష్టిగా విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తీసుకు వచ్చిన పథకాలను బంద్ చేయడమే కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు అని వ్యంగ్యంగా అన్నారు. గతంలో దసరా, బతుకమ్మ పండగల 2లో

# మందుబాబులకు అందుబాటులోకి కొత్త లిక్కర్ విధానం



**పలు బ్రాండ్ల మందు అందుబాటులోకి ..**
**హర్షం వ్యక్తం చేస్తున్న మందుప్రియులు**

అమరావతి, (అక్టోబర్ 16) : ఏపీలో మందుబాబులు ఎన్నాళ్లనుంచో కొనసాగుతున్న ఎదురుచూపులకు తెరపడింది. నూతన మద్యం పాలసీ అమలులోకి రావటంతో కొన్ని ఉద్రిక్త పరిస్థితుల తర్వాత కొత్తగా ప్రైవేటు వ్యక్తులు వేలంలో దక్కించుకున్న లిక్కర్ షాపులు మందుబాబులకు నేటి నుంచి అందుబాటులోకి వచ్చాయి. దీంతో షాపుల 2లో

# సంపాదకీయం

## ఈ మేధావుల త్యాగాలు వృథా అవుతాయా?

కొందరు కొన్ని జీవితాలను ఎందుకు ఎంచుకుంటారో తెలియదు. మూడు దశాబ్దాల క్రితం ఢిల్లీలో ఖల్సా కాలేజీలో విద్యార్థులకు ఆర్థిక శాస్త్రం బోధించే సివి సుబ్బారావు అక్కడితో సరిపెట్టుకోకుండా పౌరహక్కుల ఉద్యమంలో విస్తృతంగా పనిచేసేవారు. ఎమర్జెన్సీలో అనేకమంది నేతలతో పాటు అరెస్టయిన వారిలో సుబ్బారావు ఒకరు. విశాఖపట్టణంకు చెందిన సుబ్బారావు ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రజాందోళనల గురించి మాత్రమే కాదు. దేశంలో ఎక్కడ ప్రజలకు సామూహికంగా ఏ అన్యాయం జరిగినట్లు సమాచారం వచ్చినా నిజనిర్ధారణ కమిటీల పేరుతో టీమ్‌ను వేసుకుని వెళ్లి ప్రజలను కలుసుకుని నివేదికలు సమర్పించేవారు. 1984లో సిక్కుల ఊచకోత జరిగినప్పుడు సుబ్బారావు సారథ్యంలో ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు సేకరించిన పౌరహక్కుల సంఘాలు 'ఎవరు నేరస్థులు' అన్న శీర్షికతో నివేదిక ప్రచురించాయి. అందులో ఢిల్లీ కాంగ్రెస్ నేతలు జరిపిన దారుణాలను పూసగుచ్చినట్లు వివరించారు. సిక్కుల ఊచకోతపై ఇప్పటికీ ఈ నివేదికలోనే సాధికారిక సమాచారం లభిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనపై నిష్పాక్షికంగా, ఇరువైపులా వాస్తవాలను పరిశీలించాలనే విషయంలో సుబ్బారావుకు, బాలగోపాల్‌కు ఒకే రకమైన అభిప్రాయాలు ఉండేవి. సుబ్బారావు పౌరహక్కుల మీద కాకుండా రాజకీయార్థిక శాస్త్రం, సాహిత్యంపై దృష్టి కేంద్రీకరించి ఉంటే అద్భుతమైన రచనలు వచ్చేవి. ఆయన 'విభాత సంధ్యలు' ఇప్పటికీ సాహిత్య విద్యార్థులకు ఒక ప్రామాణిక గ్రంథం. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా 24గంటలు పనిచేయడం, విస్తృత పర్యటనలు చేయడం మూలంగా ఆయన 1994లో గుండెపోటుతో మరణించారు. ఢిల్లీ విద్యుత్ శ్మశానవాటికలో ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగినప్పుడు వందలాది విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. యలవర్తి నవీన్ బాబు (బాపట్ల ప్రాంతీయుడు) ఢిల్లీ జెఎన్‌యులో పిహెచ్‌డి చేస్తూ ఉండేవారు. 'వర్ణం నుంచి జాతి వరకు' అనే ఒక అద్భుతమైన పరిశోధనా పత్రాన్ని ఆయన వెలువరించారు. ఋగ్వేద కాలం నుంచి ఇప్పటి వరకు వర్ణ వ్యవస్థను ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామంలో భాగంగా ఆయన ఈ పుస్తకంలో వివరించారు. నవీన్ బతికి ఉంటే ఇంకా ఎన్ని ఉత్తమ రచనలు చేసేవారో కదా. ఉన్న ట్లుండి ఆయన విశాఖపట్టణం సమీపంలోని ఒక గ్రామంలో 2000 సంవత్సరంలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించారని ఒక రోజు పేపర్లో వార్త చదివి దిగ్భ్రాంతి చెందాను. ఢిల్లీలో నిజాముద్దీన్ ప్రాంతంలో ఒక చిన్న గదిలో బిడి శర్మ అనే మాజీ ఐఏఎస్ అధికారి నివసించేవారు. మాథమెటిక్స్‌లో పిహెచ్‌డి చేసిన ఆయన సివిల్ సర్వీస్‌కు ఎంపికై బస్తర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఒక దశలో కరువు పరిస్థితుల్లో ఎవరి ఆదేశాలకోసం ఎదురు చూడకుండా ఫుడ్ కార్పొరేషన్ గోదాములు తెరిపించి అన్నార్తులకు ఆహార ధాన్యాలు సరఫరా చేయించారు. జాతీయ షెడ్యూల్డు కులాలు, జాతుల కమిషన్ కమిషనర్‌గా ఆయన ప్రచురించిన అద్భుతమైన నివేదికలే అణగారిన వర్గాలకోసం సబ్ ప్లాన్ వంటి పలు విధాన నిర్ణయాలు చేసేందుకు కారణమయ్యాయి. పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ బస్తర్‌కు వెళ్లి ఆదివాసుల హక్కుల కోసం 'భారత్ జనాం దోళన్' అనే సంస్థ ప్రారంభించి అనేక ఆందోళనలు నిర్వహించారు. స్లీపర్ క్లాసు రైళ్లలో, సిటీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తూ తన ఆదాయ మంతా ఆదివాసీల కోసమే ఖర్చు చేసేవారు. 2012లో సుకుమా జిల్లా కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను నక్సలైట్లు కిడ్నాప్ చేసినప్పుడు ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి ఆయనను విడుదల చేయించడంలో కీలకపాత్ర పోషించారు. 2015లో శర్మ మరణించారు. ఆరోగ్య, వైద్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన డాక్టర వినాయక్ సేన్ జెఎన్‌యులో సోషల్ మెడిసిన్, కమ్యూనిటీ హెల్త్ కేంద్రంలో ఫ్యాకల్టీ సభ్యుడుగా ఉం డేవారు. తర్వాత ఈ ఉద్యోగాన్ని వదులుకుని పౌర హక్కులకోసం పనిచేయడం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌కు వెళ్లి తన భార్య డాక్టర్ ఇలీనా సేన్‌తో కలిసి 'రూపాంతర్' అనే ఎన్జీవో స్థాపించి అనేక గ్రామాల్లో మద్యపానానికి, స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించారు. ఆదివాసీల్లో పోషకాహార విలువల లేమిపై ఆందోళన వ్యక్తం చేసేవారు. పేద ప్రజలకోసం ఆసుపత్రి స్థాపించారు. 2000లో ఛత్తీస్‌గఢ్ ఏర్పడినప్పుడు ఆయనను ఆరోగ్య వ్యవహారాలపై ప్రభుత్వ సలహాదారుగా ఉండమని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. 2005లో ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లకు వ్యతిరేకంగా సల్వాజుడుం ప్రారంభించినప్పుడు ఆయన దానివల్ల జరుగుతున్న దారుణాలను వెలుగులోకి తీసుకురావడం ప్రారంభించారు. ఇదే ఆయన అరెస్టుకు కారణమైంది. తాను సల్వాజు డుంతో పాటు మావోయిస్టుల హింసాకాండను కూడా ఖండించానని చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఆయనను సుప్రీంకోర్టు బెయిల్‌పై విడుదల చేసింది. ఆయన విడుదలైన రెండేళ్లకు 2007లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించారు. మరో మేధావి బాలగోపాల్. ఢిల్లీలో స్లీపర్ క్లాస్ కోచ్ దిగి కనీసం పది మైళ్లు నడుస్తూ ఇంటికి వచ్చేవారు. ఎప్పుడో ఉతికినట్లున్న షర్టు, అరిగిన చెప్పులు. వచ్చీ రాగానే తన బ్యాగు లోంచి పాత టైప్ మిషన్ తీసి ఏదో నిజనిర్ధారణ కమిటీ నివేదిక టైప్ చేయడం మొదలు పెట్టేవారు.

## గుండు సున్నా చేసిన సీఎం రేవంత్ రెడ్డి

వేళ.. ఒక చీర కాదు.. రెండు చీరలు ఇస్తామన్నాని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పండగ వేళ.. అక్కచెల్లెమ్మలను నిరుత్సాహపరిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధు కింద రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించి.. అవి ఇవ్వకుండా గుండు సున్నా చుట్టాడని విమర్శించారు. కేసీఆర్ కిట్ కంటే మంచి కిట్ ఇస్తామని చెప్పి.. పేద గర్భిణీలను సైతం మోసం చేశాడని చెప్పారు. ముదిరాజ్, గంగాపుత్రులంటే సీఎం రేవంత్ రెడ్డికి చిన్నచూపు అని ఆయన ఆరోపించారు. ఆగస్టులో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చిన పోయలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము రూ. 100 కోట్లు ఖర్చు చేస్తే.. ఈ రేవంత్ సర్కార్ చేప పిల్లల కోసం బడ్జెట్‌లో పెట్టింది.. కేవలం రూ .16 కోట్లు మాత్రమేనని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. వర్షా కాలంలో చెరువులు నిండుకుండలా ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ చేప పిల్లల సగమే పోయాలంటున్నారని రేవంత్ రెడ్డి సర్కార్ వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పు అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరి 10 మాసాలు దాటింది. అయితే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలులో ఈ సర్కార్ తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తుందని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాగే తెలంగాణలో చెరువులు, నాలలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుంది. అందులోభాగంగా హైడ్రాను ఏర్పాటు చేసింది. అయితే ఈ హైడ్రా కారణంగా మధ్యతరగతి, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ నేతల నిప్పులు చెరుగుతున్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలుపై సైతం ఈ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు..

## రికార్డు స్థాయిలో ప్రభుత్వం అప్పులు

ఇవ్వకుండా ఇన్ని వేల కోట్లు ఏం చేశారని నిలదీశారు. రాష్ట్రంలో సంపద సృష్టించే ప్రయత్నం చేయకుండా సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరమన్నారు. ఈ అప్పులు రాష్ట్ర భవిష్యత్ కే పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

## అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు?

ఏమైనట్టు? 80 వేల కోట్ల ధనం ఎవరి జేబులోకి వెళ్లినట్టు? బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా? కమిషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా? అప్పు శుద్ధ తప్పు అని ప్రచారంలో ఊదరగొట్టి అవే అప్పుల కోసం ముఖ్యమంత్రి పాకులాడటమేంటి? బీఆర్ఎస్ హయాంలో అప్పులు తీసుకుని ప్రాజెక్టులు కట్టాం. ప్రతి పైసాతో మౌలిక సదుపాయాలు పెంచాం. తీసుకున్న రుణంతో దశాబ్దాల కష్టాలు తీర్చాం" అని అన్నారు కేటీఆర్. కానీ, రేవంత్ రెడ్డి తెస్తున్న అప్పుల అడ్రస్ ఎక్కడుందని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా వేయకుండా, కొత్త ప్రాజెక్టు కట్టకుండా, నెలలపాటు జీతాలు ఇవ్వకుండా, ఇన్ని వేలకోట్లు ఏమైనట్టు? ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరం, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు పెను ప్రమాదం అంటూ విమర్శించారు. అప్పులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు మంత్రి సీతక్క. "తొమ్మిదన్నరేళ్లలో మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది ఎవరు? అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు? మీ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారు. వాటికి కిస్తీలు, వడ్డీల కోసం ప్రతిరోజు టంచన్‌గా రూ.207 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అంటే ప్రతి నెలా సగటున రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను కడగడానికే సరిపోతుంది. అప్పుల అప్పారావు లాగా అందిన కాడల్లా అప్పులు చేసి, రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేనితో కొట్టాలి" అంటూ కౌంటర్ ఇచ్చారు సీతక్క. అప్పులు చాలవన్నట్లు వేల కోట్ల బకాయిలను చెల్లించలేదని, చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారని మండిపడ్డారు. 5 వేలకోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆరోగ్య శ్రీ, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, సర్పంచుల బకాయిలు, విద్యుత్ సంస్దలకు, ఆర్టీసీకి, గురుకుల భవనాల ఓనర్లకు అద్దె, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిధుల పెండింగ్, ఇలా ప్రతి శాఖలో వందల కోట్ల బకాయిలు పెట్టి ఇప్పుడు బుకాయిస్తే ఏలా అని ప్రశ్నించారు."మీ నిర్వాకంతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ, ఈ 10 నెలల కాలంలో 18 వేలకోట్ల పంట రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల వంటింటి భారం దించేందుకు రూ.500 కే గ్యాస్ సిలిండర్, సామాన్యులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ శాం. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు, ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలకు శ్రీకారం చుట్టాం. అయినా మీరు అప్పులు, బకాయిలు, హామీల గురించి నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది" అంటూ మండిపడ్డారు సీతక్క.

## స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్లో భగ్గుమన్న వర్గపోరు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిన్న,మొన్న పార్టీలో చేరిన వారికీ,కడియం తన వర్గీయులకే పెద్ద పీట వేస్తున్నారని మండిపడ్డారు.మొదటి నుండి కష్ట నష్టాలను ఓర్చుకుంటూ పార్టీ జెండా మోశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడు అధికారంలోకి రాగానే బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన అనుచరులకు ప్రాధాన్యత కల్పిస్తూ కరుడుకట్టిన అసలుసిసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.గత పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రధానకార్యదర్శి,నియోజకవర్గ ఇంచార్జ్ సింగపురం ఇందిరా ఆదేశాలతో కష్ట నష్టాలకు ఓర్చుకుంటూ కాంగ్రెస్ పార్టీని కాపాడుకున్నామని.ఈరోజు మమ్మల్నే పక్కకు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి ఏక పక్ష నిర్ణయాలు తీసుకోకుండా గ్రామా శాఖా,మండల శాఖా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియంకు సూచించారు.లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,అధిష్టానానికి పిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## అధిష్టానానికి పిర్యాదు చేస్తాం

### -ధర్మసాగర్ మండల కో ఆర్డినేటర్ కొత్తపల్లి బిక్షపతి



ఇందిరమ్మ కమిటీల్లో అసలు సిసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు, కరుడుగట్టిన కాంగ్రెస్ వాదులకు మాత్రమే అవకాశం కల్పించాలి.నిన్న మొన్న పార్టీలో చేరిన వారికీ,ఎమ్మెల్యే తమ అనుచరులకే పెద్దపీట వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏక పక్ష నిర్ణయాలు తగదని అన్నారు.కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ,మండల శాఖా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఇందిరమ్మ కమిటీలు వేయాలని అన్నారు.ప్రభుత్వ,పార్టీ కార్యక్రమాల్లోనూ ఇందిరా వర్గం పట్ల వివక్ష చూపుతున్నారని,ఇప్పటికైనా ఎమ్మెల్యే తన వైఖరిని మార్చుకోవాలని లేదంటే సీఎం రేవంత్ రెడ్డికి,అధిష్టానానికి పిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## మందుబాబులకు అందుబాటులోకి కొత్త లిక్కర్ విధానం

యజమానులు వారానికి సరిపడా స్టాక్ ఏపీఎస్‌బీసీఎల్‌కు ఆర్డర్లు పెట్టారు. ప్రస్తుతం కొత్త లిక్కర్ షాపులు ఏపీ వ్యాప్తంగా పెట్టిన ఆర్డర్ల విలువ దాదాపు రూ.400 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ రేటుకు అన్ బ్రాండెడ్ లిక్కర్ తాగిన మందుబాబులు ప్రస్తుతం అన్ని బ్రాండ్ల మందు అందుబాటులోకి రావటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే మరో పక్క చంద్రబాబు సర్కార్ సైతం కొత్త మద్యం పాలసీ ద్వారా ఆర్థిక సంవత్సరం రెండవ అర్ధ భాగంలో లిక్కర్ షాపుల లైసెన్సులు, అమ్మకాల రూపంలో రూ.20,000 కోట్లు ఆదాయంగా పొందనుందని విశ్లేషకులు అంచనా వేశారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 3396 షాపుల వేలం కోసం దరఖాస్తుల రుసుము రూపంలో రూ.1,800 కోట్లను వసూలు చేసిందని వెల్లడైంది. గత ఏడాది లిక్కర్ అమ్మకాలతో రూ.30 వేల కోట్లు వచ్చాయి. ఇదే క్రమంలో ఏపీ సర్కార్ మద్యం అమ్మకాలపై 2 శాతం డ్రగ్ రీహ్యాబిలిటేషన్ సెస్ విధించాలని నిర్ణయించింది. ఇది మద్యం ప్రియులపై అదనపు భారంగా ఉండగా దీని ద్వారా మరో రూ.100 కోట్లు ప్రభుత్వానికి ఆదాయంగా రానుందని తెల్సుతోంది. ఇప్పటికే రౌండ్ ఆఫ్ చార్జీల రూల్స్ కొంత విమర్శలను అందుకుంటున్న సమయంలో సెస్ గురించి ఏపీ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే షారులు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు తెరచి ఉంచేందుకు వీలు కల్పించింది.

ఇదే క్రమంలో డిజిటల్ చెల్లింపులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావటంపై ఉండి ఎంఎల్ఏ రఘురామ కృష్ణ రాజు సైతం హర్షం వ్యక్తం చేశారు. రాయల్ ఛాలెంజర్స్ విస్కీ క్వార్టర్ రూ.230, 8PM విస్కీ క్వార్టర్ రూ.230, మెక్ డొవెల్స్ విస్కీ క్వార్టర్ రేటు రూ.180, ఆఫీసర్స్ ఛాయిస్ విస్కీ క్వార్టర్ రూ.150గా ఉన్నాయి. ఇదే క్రమంలో మ్యాన్షన్ హౌస్ క్వార్టర్ ధర రూ.240, ఓల్డ్ మాంక్ రమ్ క్వార్ట్ రూ.230, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ బీర్ రూ.200 ఇలా చెప్పుకుంటూ పోతో కొత్త మద్యం అమ్మకాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం షాపులు దక్కించుకున్న వారికి వారం రోజుల కోసం తాత్కాలిక లైసెన్సులు జారీ చేయబడ్డాయి. దీని తర్వాత పూర్తి స్థాయి రెండేళ్ల కాలానికి సంబంధించిన కొత్త లైసెన్సులను వ్యాపారులు అందుకోనున్నారు. 5 ఏళ్ల తర్వాత మంచి లిక్కర్ అందుబాటులోకి వస్తున్నందున ఏపీలో మందుబాబులో సంతోషంలో ఉన్నప్పటికీ సెజ్, రౌండాఫ వంచి చర్యలు భారాన్ని మోపుతున్నాయని చాలా మంది అంటున్నారు. ఇదే క్రమంలో ఏపీలో ప్రైవేటు వ్యక్తుకు లిక్కర్ షాపుల వేలంపాట ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అయితే షాపులను దక్కించుకునే విషయంలో స్థానిక అధికార పార్టీ నేతల నుంచి సమస్యలు వస్తున్నాయనే ఆరోపణలు వచ్చిన వేళ సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో షాపులు దక్కించుకున్న వ్యక్తులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేదేలేదని బాబు హెచ్చరించారు. దాదాపు 70 మంది ఎమ్మెల్యేలు ఈ విషయంలో ఇన్వాల్వ్ అయినట్లు ప్రస్తుతం తెలుస్తోంది.

## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కేంద్రం పెంచింది. ఇందులో గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.రైతులకు దీపావళి కానుకగా రావి పంటల ఎంఎస్పిని కూడా పెంచాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. నివేదిక ప్రకారం.. మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ప్రభుత్వం రబీ పంటలకు కొత్త కనీస మద్దతు ధర (MSP)ని నిర్ణయించింది. ఇందులోభాగంగా గోధుమల ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.150 పెంచి రూ.2,425కి చేరుకుంది. ఇది ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.2,275గా ఉంది. ఆవాలపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెంచి క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.5,950కి పెరిగింది. అదేవిధంగా, కందుల ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.210 పెంచాలని నిర్ణయించారు. దాని కొత్త ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా మారింది. ఇది గతంలో క్వింటాల్‌కు రూ.5440గా ఉంది. ఇది కాకుండా కందులుపై ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.275 పెంచి క్వింటాల్‌కు రూ.6,425 నుంచి రూ.6,700కి పెంచారు. కుసుమ ధర రూ.5,800 నుంచి రూ.140 పెరిగి రూ.5,940కి చేరింది.రైతులకు వారి పంటలకు ప్రభుత్వం హామీ ఇచ్చే కనీస మద్దతు ధర ఎమ్ఎస్పీ అంటారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే ధర ఇది. పంటల ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల నష్టాల నుంచి రైతులను రక్షించడమే దీని లక్ష్యం. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ .. రైతుల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్నారు. పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉన్న రైతుల గురించి కూడా ప్రస్తావించారు. రైతుల సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉన్నామని, రైతులకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

## వైసీపీ నేత సజ్జలకు బిగ్ షాక్

సన్నిహితుడుచైతన్యసోమవారం రోజునమంగళగిరి కోర్టులో లొంగి పోయారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం విజయం సాధించిన నాటి నుంచి అతను పరారీలో ఉన్నాడు. అయితే తాజాగా అతను కోర్టులో లొంగిపోయారు. అలాగే సోమవారం నాడు వైసీపీ నేతలు అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలసిల రఘురామ్‌ను మంగళగిరి పోలీసులు స్టేషన్‌కు పిలిచి విచారణ జరిపారు. దాడి సమయంలో తీసిన ఫొటోలను చూపించి పలు ప్రశ్నలు సంధించారు. అయితే ఈ కేసును సీఐడీకి అప్పగించాలని ఏపీ ప్రభుత్వం ఆదివారం నిర్ణయించింది. కేసు విచారణ పూర్తిగా సీఐడీ చేతికి వెళ్లే వరకూ మంగళగిరి పోలీసులు దర్యాప్తు చేస్తారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# మాతా, శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలో మాతా, శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా కలెక్టర్ చాంబర్ లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డా, రమణ, ఫాక్సీ జిల్లా అధ్యక్షురాలు డా, స్వరూపలతో కలిసి ప్రోగ్రాం అధికారులతో జిల్లాలో మాతా, శిశు మరణాల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మాతా, శిశు మరణాల రేటు పూర్తిగా నియంత్రించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలు నమోదు చేసుకొని వైద్య పరీక్షలు, మందులు పొందే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గర్భస్థ సమయంలో మహిళలలో ఏర్పడే ఊబకాయం, రక్తపోటు ఇతర వ్యాధులను నియంత్రించేందుకు ప్రతి రోజు చేయవలసిన వ్యాయామం, యోగాసనాలతో పాటు తీసుకోవలసిన ఆహారం, పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర సమయాలలో గర్భిణులకు 2డి ఇకో చేసేందుకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని, తక్కువ బరువుతో జన్మించిన చిన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలకు 100 శాతం వాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా, అనిత, డా, కృపాబాయి, డా, సుధాకర్ నాయక్, జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డా, కృష్ణవేణి, డిపిఓ ప్రశాంతి, వైద్యాధికారులు, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

## -హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య




**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:** అమలులోకి వచ్చిన నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ, పోలీస్, విద్య, విద్యుత్, రవాణా, ఎక్సైజ్, పౌర సరఫరాలు, మైనింగ్, యాంటీ నార్కోటిక్స్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల ఉన్నతాదికారులతో భారతీయ నూతన న్యాయ చట్టాలు, ఎన్ ఫోర్స్మెంట్, రోడ్డు భద్రత అంశాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ అవుతున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలపై దృష్టి సారించేందుకు మండల, జిల్లాస్థాయిలో అధికారులు సమన్వయ సమావేశాలను నిర్వహించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నూతనంగా న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయని అన్నారు. ఐపిసి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమలవుతున్నాయని అన్నారు. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సిఆర్పిసి స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఐఈఏ స్థానంలో భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. ప్రస్తుతం సాంకేతికత ఎంతో పెరిగిందన్నారు. పెరిగిన సాంకేతికతతో నేరాలు కూడా పెరుగుతున్నాయి అన్నారు. అదేవిధంగా నూతన చట్టాలలో మహిళలు, చిన్నారుల రక్షణకు, భద్రతకు అనేక అంశాలు పొందుపరిచి ఉన్నాయన్నారు. జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖ సంస్కరణలు, చట్టాల అమలు తీరుపై మంచి పేరు ఉందని అన్నారు. జిల్లాలో అధికారుల సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నియంత్రణకు తోడ్పాటునందించాలన్నారు. నూతన న్యాయ చట్టాలపై పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్వో వై. వి. గణేష్, డీసీపీ సలీమా, డీఈఓ వాసంతి, డిఎంహెచ్వో డాక్టర్ లలిత దేవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె. నారాయణ, ఏసీపీలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విదేశీ విద్యానిధి పథకం కొరకు దరఖాస్తుల స్వీకరణ

## - జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి

**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** 2024-25 విద్యా సంవత్సరానికి గాను విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కొరకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానిధి పథకం ఉపకార వేతనాల కొరకు ఆన్లైన్లో ఈ-పాస్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ వరకు గడువు పొడిగించడం జరిగిందని, ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, జిల్లాకు చెందిన అర్హత గల షెడ్యూల్డ్ కులముల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎన్నికలకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

## - బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్





**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ (బిజెపి) జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కోరారు. ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని గ్రీన్ సిటీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ లోని క్రీడాకారులను, పల్లవి మోడల్ పాఠశాల లోని ఉపాధ్యాయులను కలిసి, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు నమోదుకు బిజెపి జిల్లా కార్యాలయం నెంబర్ 9160603222 ను సంప్రదిస్తే, తామే ఓటు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బింగి ప్రవీణ్, బియ్యాల సతీష్ రావు, బొలిశెట్టి అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

# రంగనాయక స్వామి భూములను రక్షించాలి

## -ఆలయ చైర్మన్ దేశ పాండే రాఘవేంద్రరావు



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ గ్రామంలోని రంగనాయక స్వామి భూములను రక్షించాలని రంగనాయక స్వామి ఆలయ చైర్మన్ దేశ్ పాండే రాఘవేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా రంగనాయక స్వామి ఆలయ చైర్మన్ పెద్ద రామచంద్ర రావు వంశంలోని ఆరవ వంశస్థుడు దేశ్ పాండే రాఘవేంద్రరావు మాట్లాడుతూ... గట్ల ఖానాపూర్ గ్రామానికి చెందిన పూర్వీకులు పెద్ద రామచంద్రరావు దాదాపు 457 సంవత్సరాల కింద అందాజ 1430 ఎకరాల భూమిని రంగనాయక స్వామి ఆలయ అభివృద్ధికి ప్రోత్సహించక భూమిని గ్రామంలోని ప్రజలు అలాగే పరిసర ప్రాంతాల ప్రజలు కౌలు రూపంలో పంటలు పండించుకొని శ్రీ రంగనాయక స్వామి ఆలయ అభివృద్ధికి ప్రోత్సహించాలని వీలునామాలో అమలు పరచడం జరిగిందని వారు తెలిపారు. వంశపారంపరంగా కొనసాగుతున్న రంగనాయక స్వామి భూమిని గత కొంతకాలంగా రంగనాయక స్వామి భూమిలో సాగు చేసి పంటలు పండిస్తూ ఆలయానికి తోడ్పడకపోవడమె కాకుండా అమ్మకాలకు గురిచేస్తున్నందున 2022 సంవత్సరంలో లోకయుక్తను సంప్రదించగా రంగనాయక భూమి సర్వేకు లోకయుక్త సహకరించి హైకోర్టు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ అధికారులు సర్వే నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఎండోమెంట్ అధికారులు సర్వే డిపార్ట్మెంట్ ను సంప్రదించి రంగనాయక స్వామి ఆలయ భూమి సర్వేలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. రంగనాయక స్వామి ఆలయ కమిటీకి గ్రామంలోని రైతులు సహకరించి రంగనాయక స్వామి ఉత్సవాల కార్యక్రమాలకు ప్రోత్సహించాలని వారు కోరారు. రంగనాయక స్వామి ఆలయ భూములను సర్వే చేసిన అనంతరం కౌలు రైతులకు అందజేసి పంటల ద్వారా వచ్చే కౌలు ను రంగనాయక స్వామి ఉత్సవాలకు ఖర్చు చేయడం జరుగుతుందని వారికి తెలిపారు.

**దేవదాయ భూములను అమ్మకాలకు పెడితే చర్యలు చేపడతాం**
**రంగనాయక స్వామి దేవాలయం ఈవో సత్య చంద్రారెడ్డి**

రంగనాయక స్వామి భూములను సాగుకు నిర్వహిస్తున్న కౌలు రైతులు అమ్మకాలకు పెడితే చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో సత్య చంద్రారెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తరతరాలుగా కొనసాగుతున్న రంగనాయక స్వామి భూములను రక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులకు ఉందని వారు తెలిపారు. రంగనాయక స్వామి ఆలయ భూములను అమ్మకం లేదా కొనుగోలు చేయడం చేస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు ఒక ప్రకటనలో హెచ్చరించారు. రంగనాయక స్వామి ఆలయ భూములకు సర్వే నిర్వహించడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకుండా గ్రామస్తులు సహకరించాలని వారు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే డిపార్ట్మెంట్ కు ఆదేశాలు జారీ చేయడంతో ఎండోమెంట్ అధికారులు సర్వే చేయడం జరుగుతుందనిబుధవారం రోజు వరకు 2వ, 4వ, 5వ, 6వ, 10వ, 11వ సర్వే నెంబర్లలో గల భూమిని సర్వే చేయడం జరిగిందని వారు తెలిపారు. ఇంకా మిగిలిన సర్వే నెంబర్లను సోమవారం వరకు పూర్తిచేయడం జరుగుతుందని వారు తెలిపారు. వీటితోపాటు కందూరు కొమిరెడ్డిపల్లి శాఖాపూర్ దేవరకద్ర మోజెర్ల మదిగట్ల తదితర ప్రాంతాలలో గల భూమిని సర్వే నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేశ్ పాండే రాఘవేంద్రరావు రంగనాయక స్వామి దేవాలయ ఈవో సత్య చంద్రారెడ్డి ఎండోమెంట్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి నాగేషు మారుతీ రావు కృష్ణ సర్వేయర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మాన్ని కాపాడుటక్కె హైందవులు క్షేత్రపాలకులుగా ముందుండాలి



**హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు:** సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కటినంగా శిక్షించాలని హసన్పర్తి నగర హైందవధర్మపరిరక్షణ ప్రముఖులు గురుమూర్తి భద్రదేవ్ ఆద్వర్యంలో హసన్పర్తి జాతీయరహాదారి యందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హసన్పర్తి మండల ప్రముఖ పురోహితులు దహగం రమేష్ శర్మ హాజర్కె మాట్లాడుతూ అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారెవర్కెన ప్రభుత్వం తక్షణమే కటినంగా శిక్షించాలని అన్నారు. హిందూ దేవాలయాలపై ఇలాంటి దాడులు జరగడం బాధాకరమని, ఆలయాల సంరక్షణక్కె హైందవసోదరులు క్షేత్రపాలకులగా ఉండాలని, భరతభూమిలో భారతీయ సంస్కృతి, సంప్రదాయ ఆచార వ్యవహార విలునలని కాపాడుకోవడం భారతపౌరుల కర్తవ్యమని, దేశద్రోహులని క్షమించరాదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నగర పురోహితులు వేదాంతం సంపతాచార్యులు గురుమూర్తి గురుదత్తు, కాజీపేట వెంకటస్వామి, హసన్పర్తి పెద్దమ్మతల్లి ఆలయ అర్చకుడు శ్రీనివాస్, హసన్పర్తి రాజరాజేశ్వరి ఆలయం చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీల్లో అసలైన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి

## - ప్రాధాన్యత ఇవ్వట్లేదని కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకుల ఆవేదన
## - కొన్ని ఏళ్ల నుండి జెండా మోసిన కార్యకర్తలకు అవకాశం కల్పించాలి



**జఫర్ ఘడ్ ,తెలంగాణ ముచ్చట్లు:** గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ జెండా మోసిన వారికి కాకుండా కొత్తగా పార్టీలో వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలలో పాత వారికి కాకుండా పార్టీ మారి వచ్చిన కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గ్రామాలలో కాంగ్రెస్ జెండాలను భుజాలపై వేసుకొని కేసుల పాలై చివరికి అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేసిన కాంగ్రెస్ నాయకులను అవమానిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కాంగ్రెస్ అధిష్టాన నాయకులు పార్టీలో కొత్తగా వచ్చిన వారికి కాకుండా గత కొన్ని ఏళ్లుగా కాంగ్రెస్ జెండాను నమ్ముకున్నా కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ విషయం అధిష్టానం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకపోతామన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి పట్టపూరి సదయ్య గౌడ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జి రడపాక రాజ్ కుమార్, నియోజకవర్గ యువజన నాయకులు తాటికాయల రాజేందర్, మండల అధికార ప్రతినిధి యండి ముఖ్తార్ ఆలీ, మండల నాయకులు ఉల్లి శివరాజ్ , మాజీ ఉపసర్పంచ్ నంచర్ల లత యాదగిరి, మర్రి రమేష్,బానోతు లచ్చిరాం నాయక్ , మండలంలోని వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు బానోతు బిక్షపతి, నీలం రాజయ్య,సముద్రాల సత్యనారాయణ సీనియర్ నాయకులు నీలం రమేష్, యువజన కాంగ్రెస్ నాయకులు రడపాక దానియేలు, నీలం శేఖర్,కందిక అఖిల్,ఇల్లెందులో అశోక్,దాట్ల కార్తీక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పుష్పాభిషేకం

**తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:** రాష్ట్రంలో బీసీ కుల గణన ప్రక్రియ ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం సమీపంలో కల రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ముందుగా కుల గణన ప్రక్రియ ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బిసి కుల గణన ప్రక్రియ మొదలు పెడుతూ జీఓ నెంబర్ 18ని విడుదల చేయడం సంతోషకరమని



హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంతోనే మొదలైన సింగరేణి విధ్వంసం

## - సింగరేణిలో కొత్త గనులు, కొత్త పనులు కావాలి
## - నూతన గనులతోనే ఏరియా భవిష్యత్తు
## - హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్




**తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత సింగరేణికి నూతన గనులు లభించి, స్థానిక యువతకు పనులు వస్తాయనుకుంటే, గత ప్రభుత్వంతోనే సింగరేణి విధ్వంసం మొదలైందని సింగరేణి మైనర్స్, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం ఏరియాలోని ఆర్కేపి ఓసిపిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014 నుండి 2024 వరకు గడిచిన 10 ఏండ్ల కాలంలో సింగరేణి యాజమాన్యం ఒక నూతన గనిని సైతం ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. సింగరేణిలో 2014లో 65 వేల మంది కార్మికులు ఉండగా, ప్రస్తుతం 40 వేల మంది కార్మికులు మాత్రమే ఉండటమే అభివృద్ధా అని ప్రశ్నించారు. సింగరేణికి జెన్కో తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాలు చెల్లించాల్సిన బకాయిలు 34 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏరియాలోని ఆర్కేపి ఓసిపి కి సరైన ప్రణాళిక లేక మూసి వేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా అటవీశాఖ క్లియరెన్స్, ఫ్యూచర్ అడ్వాన్స్ థింకింగ్ ప్రణాళిక లోపం వలన కార్మికులు ఇబ్బందుల పాలు అవుతున్నారని ఆరోపించారు. ఏరియా బతకాలంటే ఆర్కేపి ఓసిపీ, కేకే 6, శ్రావణ్ పల్లి ఓసిపి లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెల్ది సుదర్శన్, చొప్పరి రామస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# షాపూర్ లో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

## - బహుజన వీరుడు పండుగ సాయన్న - వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం షాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘం తో పాటు గ్రామం ప్రజలు ఎంతో ఐక్యతగా ఏర్పడి గ్రామంలో పండుగొల్ల సాయన్న లాంటి సాహస వీరుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. షాపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని మొట్టమొదటగా గ్రామంలో ఇల్లు లేని నిరుపేదల ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా ప్రజలంతా ఐక్యంగా ఉండి వారిని గుర్తించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామస్తులు నాయకులు ఎమ్మెల్యే గారికి శాలువాలతో సన్మానం




చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ,హుజుర్నగర్ నియోజకవర్గాల అంతర్గత రహదారులకు మహార్దశ

-37.60 కిలోమీటర్ల మేర కొత్త రహదారుల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్
-40 కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతీలు
-హుజుర్నగర్ నియోజకవర్గ గ్రామీణ రహదారులకు 25 కోట్లు
-కోదాడ గ్రామీణ రహదారులకు 15 కోట్లు
-గ్రామీణ రహదారులపై మంత్రి ఉత్తమ్ ప్రత్యేక దృష్టి
-ప్రజల అభ్యర్థనకు ప్రతిస్పందన
-హుజూర్ నగర్,కోదాడ నియోజకవర్గాలపై కొనసాగుతున్న కెప్టెన్ మార్క్ అభివృద్ధి



**హుజూర్ నగర్/కోదాడ,తెలంగాణ ముచ్చట్లు:** హుజుర్నగర్, కోదాడ నియోజకవర్గల పరిధిలోని గ్రామాలలో అంతర్గత రహదారులకు మహర్దశ పట్టింది. దశాబ్దకాలంగా కనీసం మరమ్మతులకు కుడా నోచుకోని ప్రాంతాల్లో కొత్తగా రోడ్డు నిర్మాణాలకు రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉపక్రమించారు. ఆ రెండు నియోజకవర్గాలలో జరుగుతున్న అభివృద్ధి పై మరోసారి మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు. ఏకంగా 40 కోట్ల నిధులను మంజూరు చేయిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ చేయించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి చేపట్టిన నూతన రహదారుల నిర్మాణంలో బాగంగా జీ. ఓ.నెంబర్ 593(11/10/2024) విడుదలైన ఉత్తర్వులలో ఆ రెండు నియోజకవర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంతాలలో 37.60 కిలోమీటర్ల నూతన రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్నగర్ నియోజకవర్గానికి 25 కోట్ల నిధులు మంజూరు కాగా ఉత్తమ్ పద్మావతీ ప్రాతినిధ్యం వహిస్తున్న కోదాడ నియోజకవర్గానికి 15 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో 23.90 కిలోమీటర్లు మేర అంతర్గత రహదారులు నిర్మించనున్నారు. నియోజకవర్గ పరిధిలోని గడ్డిపల్లి బరెల్ గ్రౌండ్ నుండి బొలిశెట్టి గూడెం మీదుగా కొనాయిగూడెం వరకు 7 కిలోమీటర్ల దూరం నిర్మించనున్న బి.టి.రోడ్ కు రూ.7.20 కోట్లు ,గరిడేపల్లి నుండి సీతారాంతండా వరకు 5 కిలోమీటర్ల కు గాను రూ.5.10 కోట్లు ,నెరేడుచర్ల మండలం దిర్శించర్ల నుండి ముత్యాలమ్మ కుంట మీదుగా చిట్టివారిగూడెం వరకు 2.90 కిలో మీటర్ల కు గాను రూ.3.20 కోట్లు, మఠం పల్లి మండలం కామాక్షికుంట తండా నుండి చెన్నాయిపాలెం వరకు 2 కిలోమీటర్లకు గాను రూ.2.20 కోట్లు, అదే మండలం బక్కమంతులగూడెం నుండి అల్లిపురం వరకు 3 కిలో మీటర్లకు గాను రూ.3.10 కోట్లు,చౌటపల్లి మండలం అల్లిపురం వరకు 4 కిలోమీటర్లకు గాను రూ.4.20 కోట్లు మంజూరు అయినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అదే విదంగా కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె మండలం నాయకుగూడెం నుండి విబలాపురం వరకు 3.20 కిలో మీటర్లకు గాను రూ.3.50 కోట్లు, అదే మండలం అన్నారిగూడెం మఱ్ఱి చెట్టు నుండి కరక్కాయలగూడెం వరకు 2 కిలోమీటర్ల దూరానికి గాను రూ.2.30 కోట్లు, నడిగూడెం మండలం వల్లాపురం నుండి కేశవాపురం వరకు 2 కిలోమీటర్లకు గాను రూ.2.00 కోట్లు, నారాయణపురం నుండి కే.ఆర్.సి పురం వరకు 3.40 కిలోమీటర్లకు గాను రూ.3.20 కోట్లు, మోతె మండలం నామావరం నుండి సీతానగరం వరకు 4 కిలో మీటర్ల దూరానికి గాను రూ.4.00 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని స్థానిక శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ వెల్లడించారు. ఇటీవల కురిసిన భారీ నుండి అతి భారీ వర్షాలకు అంతంత మంత్రాంగ ఉన్న గ్రామీణ అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్న నేపద్యంలో స్థానిక ప్రజలు,ప్రజాప్రతినిధులు సంయుక్తంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ దృష్టికి తీసుక రాగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనదైన శైలిలో యుద్ధ ప్రాతిపదికన అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహించి అంచానలు రూపొందించి నిధులు మంజూరు చేయించారు. రెండు నియోజకవర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంతాల అంతర్గత రహదారుల నిర్మాణాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిధులు మంజూరు చేయించడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

# విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



**తెలంగాణ ముచ్చట్లు,జఫర్గడ్:** డిఎస్సి-2024 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం పొంది, జనగామ కలెక్టరేట్ లో కౌన్సిలింగ్ ద్వారా మండలానికి కేటాయించబడిన 9 మంది ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ఎంఆర్సి భవనంలో బుధవారం ఎంఈఓ వద్ద రిపోర్ట్ చేసి, మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో జాయిన్ అవ్వడం జరిగిందీ. వారికి పీఆర్టియూ టీఎస్ మండల శాఖ పక్షాన కె. సీతారామయ్య శుభాకాంక్షలుతెలిపారు. విధుల్లో చేరిన వారిలో గీత , రేణుక,రాజు, శ్రీధర్, రాంబాబు, కావ్య, స్రవంతి,విజయ, శ్రీలత దేవి ఉన్నారు.

# మృతుడికి నివాళులర్పించిన మంచాల ఎల్లయ్య

**తెలంగాణ ముచ్చట్లు,జఫర్గడ్:** మండల కేంద్రంలో మహమ్మద్ అన్వల్ అనే వ్యక్తి మరణించగా బుధవారం స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు మంచాల ఎల్లయ్య మృత దేహాన్ని సందర్శించి, పూల మాల వేసి నివాళులర్పించారు. వారితో వెంట పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU TELTEL12273 తెలుగు దిన పత్రిక

# గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### -వారం రోజులల్లో పెండింగ్ పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించాలి
### -అంగన్ వాడి మరమ్మత్తు పనులలో వేగం పెంచాలి
### - సబ్ సెంటర్ల టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలిలి
### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




పెద్దపల్లి,తెలంగాణ ముచ్చట్లు : : గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పై స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయని, పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులను వారం రోజుల వ్యవధిలో పూర్తి చేసి సంబంధిత బిల్లులు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తు , టాయిలెట్ల నిర్మాణానికి మంజూరు చేసిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్ విభాగం ద్వారా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు ధర్మారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించామని, వీటిని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా టెండర్ దశలో ఉన్న 18 సబ్ సెంటర్ల పనులు త్వరగా ప్రారంభించే దిశగా టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని , మంజూరు చేసిన పనులను త్వరగా గ్రౌండ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి జి రవీందర్, ఈఈ పంచాయతీ రాజ్ గిరీష్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# పకడ్బందీగా ప్రభుత్వ భూముల సర్వే చేయాలి

### -అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి
### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, తెలంగాణ ముచ్చట్లు : మండలంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధించిన అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ధర్మారం మండల కేంద్రంలో పర్యటించారు. ధర్మారం మండలంలోని తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఏపిఎం కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రిన్నోవేషన్ పనులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఖిలా వనపర్తి లోని ప్రభుత్వ భూములను సర్వే చేసి శనివారం వరకు అందించాలని, అనంతరం బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల సర్వే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని కోర్టు కేసులు, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు ఉండేలా చూడాలని లేనిపక్షంలో అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ధర్మారంలోని ఏపీఎం కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించడానికి గుర్తించిన భూమిని కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ధర్మారం మండల తహసిల్దార్ మొహమ్మద్ ఆరిఫ్, మండల ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల పంచాయతీ అధికారి రమేష్, ఏపిఎం తులసీ మాత, ఏపిఓ రవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

### -బిఆర్ఎస్ నాయకులు లింగాల వెంకట్ రెడ్డి



దుబ్బాక, తెలంగాణ ముచ్చట్లు : అక్బరుపేట భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మరణించిన పక్కిర్ పాషా కుటుంబాన్ని బుధవారం మిరుదొడ్డి మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు లింగాల వెంకట్ రెడ్డి పరామర్శించి 50 కిలోల బియ్యం ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబానికి భవిష్యత్తులో అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది.

# సకాలంలో రైస్ డెలివరీ ప్రక్రియ పూర్తి చేయాలి

### -అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్



పెద్దపల్లి,తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వం విధించిన గడువు లోగా సకాలంలో ఖరీఫ్ 2023-24 , రబీ 2023-24 సీజన్ లకు సంబంధించి పెండింగ రైస్ డెలివరీని తప్పని సరిగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని రైస్ మిల్లర్లు, సంభందిత అధికారులతో పెండింగ్ లో ఉన్న రైస్ డెలివరీపై సమీక్షించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2023-24, రబీ సీజన్ 2023-24 కు సంబంధించి బాకీ ఉన్న రైస్ డెలివరీ నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు జిల్లాలో ఉన్న రా రైస్ మిల్లులు వారికి కేటాయించిన ధాన్యాన్ని ప్రాసెస్ చేసి ప్రతి రోజు వాటి సామర్థ్యం మేరకు అత్యధిక ఏసికే లు డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైస్ డెలివరీ ఆలస్యం చేస్తున్న రైస్ మిల్లులను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, రైస్ మిల్లులు పూర్తి స్థాయిలో నడుస్తూ నిర్దేశించిన గడువు లోగా రైస్ డెలివరీ పూర్తి చేయాలని పేర్కొన్నారు.రైస్ డెలివరీ గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయంలోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని అన్నారు. బాకీ ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో మిల్లింగ్ చేసి రైస్ అప్పగించకపోతే మిల్లర్ల పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు బోధన చేయాలి

### -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
### -10వ తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించిన జిల్లా కలెక్టరు
### -శంకరంపేట ఆర్ మండలంలో విస్తృతంగా పర్యటన






మెదక్, తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పోరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలను, మండలంలో శానిటేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ,10 తరగతుల విద్యార్థులకు , గణితం, బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారిచ్చిన సమాధానాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు గణితం, ఆంగ్లం సబ్జెక్ట్ ల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.అనంతరంన్ ఉపాధ్యాయులతో సమావేశమై కలెక్టర్ పలు సూచన చేస్తూ ఇప్పటినుండి 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటినుండి పదవ తరగతి సిలబస్ పై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తయారీ విధానమును స్టోర్ రూమ్ లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనము మెనూ ప్రకారం అందించాలని పేర్కొన్నారు. పాటశాల ఆవరణలోని బాలుర టాయిలెట్లను, పరిసరాలను స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, ఏవైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకుని హాజరు పట్టిక మరియు సాధారణ సెలవు రిజిస్టర్



లను పరిశీలించినారు. ముందస్తు సమాచారం లేకుండా, సెలవు దరఖాస్తు ఇవ్వకుండా గైర్హాజరైన ఉపాధ్యాయుల పై తప్పకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం గ్రామ పరిసరాలను పరిశీలిస్తూ ఫ్రైడే డ్రై డే ఖచ్చితంగా అమలు చేయాలని,వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సాయంకాలం మున్సిపల్ సిబ్బంది సహకారంతో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కూడా దోమలు పుట్టకుండా మరియు కుట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని తద్వారా వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీ ఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి



వరంగల్, తెలంగాణ ముచ్చట్లు : నెహ్రూ యువ కేంద్ర వరంగల్(ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర మరియు యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లా లో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘం లోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను తీసుకుని వచ్చి హన్మకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల అనగా అక్టోబర్ 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు 0870- 2958776 సంప్రదించాలన్నారు

# గత పదేళ్లలో మీరేం చేశారో గుర్తుకు తెచ్చుకోండి

## - బీఆర్ఎస్ పనికట్టుకుని బురద జల్లే ప్రయత్నం
## - ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. బీఆర్ఎస్ పనికట్టుకుని బురద జల్లే పనిలో పడ్డారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీకి కొంత సమయం ఇచ్చే వాళ్ళమని, కానీ కేటీఆర్.. హరీష్ లు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ కనిపించడం లేదు.. ప్రతిపక్ష నాయకుడు ఎవరు అనేది అర్దం అవ్వడం లేదని ఆయన అన్నారు. గత పదేళ్ల లో మీరేం చేశారో గుర్తుకు తెచ్చుకోండని, నేను ప్రతిపక్ష నేతగా ఉంటే.. నా వెంట ఉన్న ఆరుగురు ఎమ్మెల్సీలు లాక్కున్నారన్నారు. గంట సమయం ఇవ్వకుండా నా సెక్యూరిటీ.. బుల్లెట్ ప్రూఫ్ తీసేశారని, మళ్ళీ ఇప్పుడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు షబ్బీర్ అలీ. 48 మంది ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపులు చేసింది మీరు అని, తలసాని టీడీపీ ఎమ్మెల్యేగా ఉండి మంత్రిగా ప్రమాణం చేయించారన్నారు. అప్పుడు గుర్తు లేదా.. సిగ్గులేకుండా ఇప్పుడు మాట్లాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. మా పార్టీ ఇప్పటి వరకు ఎప్పుడు అలా చేయలేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ హయంలో మైనార్టీలకు ఏం చేశారు, మైనార్టీలకు మెడికల్ కాలేజి ఇచ్చారా..? అని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలతో ఇండ్లు ఇచ్చేందుకు జీఓ ఇచ్చారని, సోషల్ మీడియా లో ఇందిరమ్మ కమిటీల పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారం చేసే వాళ్లకు సిగ్గు శరం ఉండాలని, పిచ్చి మాటలు మాట్లాడకండన్నారు. మైనార్టీల కోసం183 సీట్ల లా కాలేజి ఇచ్చామని, 2 ఫార్మసీ కాలేజీలు ఇచ్చామన్నారు. కేసీఆర్ కాలేజీలు మూసేశారు.. మేము తెరిపించే పనిలో ఉన్నామన్నారు. కేటీఆర్.. హరీష్ లకు డీఎస్సీ ఎలా వేయాలి..? తెలుసా మీకు.. గ్రూప్ పరీక్షలు ఎలా పెట్టాలి అనేది తెలుసా..? మేము డీఎస్సీ..గ్రూప్స్ ఎలాంటి వివాదం లేకుండా వేస్తున్నాం..మీ కంటికి కనిపించడం లేదా..? అని షబ్బీర్ అలీ అన్నారు. అంతేకాకుండా..'తెలంగాణ నీ లూటీ చేసిన దొంగలు బీఆర్ఎస్ వాళ్ళు, దొంగల గురించి ఏం మాట్లాడాలి. గురుకులాల కి లాక్ లు వేయడం కరెక్ట్ కాదు. మూడేళ్లు కేసీఆర్ ఇవ్వలేదు బకాయిలు. బీఆర్ఎస్ నేతలు.. వెంటపెట్టుకుని తాళాలు వేయించారు. కాంగ్రెస్ నీ బదానం చేసే పనిలో బీఆర్ఎస్ ఉంది. మోడీకి రేవంత్.. నేను భయపడము, ఈడీ విచారణకు ఇద్దరం వెళ్లినం.. మమ్మల్ని వదిలేయలేదు. మీరు వెళ్ళారా ఈడీకి, కోడి గుడ్డుకు ఇచ్చే పైసలు కూడా కేసీఆర్ పెండింగ్ పెట్టిండు, మూడేళ్లు గా బిల్లులు ఇవ్వకుండా ఆపింది కేసీఆర్. మూసీపై ఇంకా డీపీఆర్ కాలేదు, మీలాగా డీపీఆర్ లేకుండా ప్రాజెక్టులు కట్టం. డీపీఆర్ కాకుండా పని చేస్తే.. మేమే మా ప్రభుత్వాన్ని అడుగుతాం' అని షబ్బీర్ అలీ అన్నారు.

# నిరంతర సాధనతోనే నేరాల ఛేదన

## - ఆధునికి సాంకేతికతను ఉపయోగించాలి
## - పోలీస్ డ్యూటీ మీట్‌లో డీజీపీ జితేందర్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : నిరంతరం నేర్చుకుంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ, జాగ్రత్తలు పాటిస్తేనే నేరాల ఛేదన సాధ్యమవుతుందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని అన్నారు. రాజేంద్రనగర్‌లోని పోలీసు అకాడమీలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో మొదటి పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం పోలీసుల్లో బృంద స్ఫూర్తిని పెంచుతుందని తెలిపారు. అన్ని కేసులను సాంకేతిక ఆధారాలతో ఛేదించాలని సూచించారు. న్యాయం జరిగితేనే బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం వస్తుందని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎస్ శాంతి కుమారి హాజరయ్యారు. నేటి నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన 400 మంది పోలీసులు పాల్గొన్నారు. దైనందిన డ్యూటీలో భాగంగా కేసుల విచారణలు, మెలకువలపై ఇక్కడ పోటీలు ఏర్పాటు చేశారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్ తదితరాలపై పోటీలున్నాయి. కేసుల ఛేదన, ఆధారాల సేకరణపై ఉన్నతాధికారులు సూచనలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్ భగవత్, శిఖా గోయల్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# యువతిపై అర్ధరాత్రి అత్యాచారం కేసు

## ఆటో డ్రైవర్‌ను గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్16: గచ్చిబౌలి ఠాణా పరిధిలో అర్ధరాత్రి యువతిపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆటోడ్రైవర్ ప్రవీణ్‌ను లింగంపల్లి పరిధిలోని గోపీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ నంబర్ ఆధారంగా కేసును ఛేదించారు. నిందితుడి స్వగ్రామం నల్గొండ జిల్లా కేతిపల్లిగా గుర్తించారు. చెన్నైకి చెందిన ఓ యువతి(32) గచ్చిబౌలిలోని నానక్‌రాంగూడలో నివాసం ఉంటున్నారు. ఆమె ఓ ప్రైవేటు సంస్థలో ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల దసరా సెలవుల నేపథ్యంలో సొంతూరు వెళ్లిన యువతి సోమవారం అర్ధరాత్రి బస్సులో నగరానికి చేరుకున్నారు. నగర శివారు రామచంద్రాపురం దగ్గర రాత్రి 1.30 గంటలకు బస్సు దిగాక నానక్‌రాంగూడ వెళ్లేందుకు ఒక ఆటో ఎక్కారు. ఇంటికి వెళ్లేమార్గంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన రోడ్డులో ఉన్న మసీద్‌బండ కమాన్ వద్దకు రాగానే జనసంచారం లేకపోవడం చూసి డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. యువతి ప్రశ్నించేలోపే వెనుక సీటులోకి వచ్చాడు. ఆమె నోరునొక్కి దాడి చేశాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించగా మరోసారి దాడి చేశాడు. దీంతో తలకు గాయమైంది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో దారిన వెళ్తున్న ఫుడ్ డెలివరీ బాయ్స్ గమనించి ఆటో దగ్గరికి వచ్చారు. ఈలోపు అతను యువతిని కిందకు తోసేసి వెంటనే పారిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువతిని భరోసా కేంద్రానికి తరలించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# కంచి విశ్వవిద్యాలయంలో 86 మంది తెలంగాణ విద్యార్థులు

## స్వామిజీని దర్శించుకున్న ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :కంచి లోని శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయంలో వివిధ ఉన్నత స్థాయి కోర్సులలో ఈ విద్యా సంవత్సరం తెలంగాణా రాష్ట్రానికి చెందిన 86 మంది చేరారు. వివిధ కోర్సులలో చేరిన ఈ విద్యార్థినీ విద్యార్థులకు కంచి స్వామిజి శంకర విజయేంద్ర స్వరస్వతి ఆశీర్వచనాలు అందచేశారు. . రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కంచి కామకోటి పీఠానికి వెళ్లి కంచి స్వామీజీ విజయేంద్ర సరస్వతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్య సంవత్సరం కంచి విశ్వవిద్యాలయంలో చేరిన తెలంగాణా కు చెందిన 34 మహిళా విద్యార్థినులు, 52 మంది విద్యార్థులతో శైలజా రామయ్యర్ సమావేశమయ్యారు. కంచి విశ్వవిద్యాలయంలో భారతీయ సంస్కృతీ, ఇంజనీరింగ్, న్యాయ శాస్త్రం, ఆర్ట్స్, హ్యుమానిటీస్ తదితర విభాగాలలో ఈ విద్యార్థులు చేరారు. వివిధ కోర్సులలో చేరిన తమకు కంచి స్వామి శంకర విజయేంద్ర స్వరస్వతి ఆశీర్వచనాలు అందచేశారని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన ఈ విశ్వ విద్యాలయంలో అత్యంత నిష్ణాతులైన ఉత్తమ అధ్యాపకులు ఉన్నారని విద్యార్థులు ఆమెకు తెలిపారు. అనంతరం, కంచి చిన్న స్వామి విజయేంద్ర సరస్వతి ని కలసి వారి ఆశీర్వచనం పొందిన ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, తెలంగాణా విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# రెండు దేశాల సంబంధాల్లో పీటముడి

## - ఉగ్రవాదం ఎగదోస్తున్నందుకే అని గుర్తించండి
## - పాక్‌కు చురకలు వేసిన విదేశాంగ మంత్రి జయశంకర్

ఇస్లామాబాద్,అక్టోబర్16: పాకిస్థాన్‌లో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మాట్లాడిన భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్.. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి చురకలు వేశారు. సీమాంతర ఉగ్రవాదం గురించి ప్రస్తావించి విమర్శలు చేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నమ్మకం, సహకారం, స్నేహం లోపిస్తే పొరుగువారు దూరమవుతారని వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటు వాద కార్యకలాపాలు ఉంటే.. ఆ రెండు దేశాల మధ్య వాణిజ్యం, అనుసంధానం, ప్రజల మధ్య సంబంధాలకు అవకాశం ఉండదని మంత్రి వ్యాఖ్యానించారు. ఎక్కడా కూడా పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ సమావేశం అనంతరం మంత్రి ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్టు పెట్టారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో మన దేశం ప్రకటనను వినిపించాను. కల్లోల ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు తగినవిధంగా ఎస్‌సీఓ స్పందించాలని అంటూ పలు అంశాలను ప్రస్తావించారు. 2019లో పూల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగింది. నాడు ఆ ఘటనలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోగా.. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా భారత వాయుసేన ఫిబ్రవరి 26న వైమానిక దాడులు చేపట్టింది. పాక్ భూభాగంలోని బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్ర స్థావరాలపై తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. ఉగ్రవాదాన్ని తాము ఎన్నటికీ సహించబోమని ఈ ఘటనతో భారత్.. పాక్ సహా ప్రపంచదేశాలకు గట్టి సందేశమిచ్చింది. ఇక అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని మంగళవారం రాత్రి తన నివాసంలో విందు ఇచ్చారు. ఈసందర్భంగా జైశంకర్, షెహబాజ్‌లు కరచాలనం చేసుకొని కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఎస్సీవో సదస్సులో భారత బృందానికి జైశంకర్ నేతృత్వం వహిస్తారు. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబరులో అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ పాకిస్థాన్‌లో పర్యటించారు.

# రైతులకు అనుకకూలంగా ప్రభుత్వం

## - అనేక నిర్ణయాలు తీసుకున్నామన్న కోమటిరెడ్డి
## - దీపావళికి ముందే మిగిలిన వారికి రుణమాఫీ
## - మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

నల్లగొండ,తెలంగాణ ముచ్చట్లు : రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని, రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు జరుగుతుందని, సుమారు 50,000 ఎకరాలలో బత్తాయి సాగు చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భాగంగా నల్గొండ జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటి వరకే 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చామన్నారు. ఈ వారం చివరి వరకు అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు,తూకం యంత్రాలు, లారీలు, హమాలీల వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతులకు వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రెండు శుభవార్త లు చెప్పారు. నిడమానూర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ గురించి ప్రస్తావించారు. దీపావళి పండుగ కంటే ముందే మిగిలిన 4లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. త్వరలో రైతు భరోసా కూడా అందిస్తామని అన్నారు. పంటరుణం రూ.2 లక్షల కన్నా పైనున్న వారికి విడతల వారీగా డబ్బులు జమ చేస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని.. రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనుగుణమైన పరిపాలన అందిస్తున్నామని.. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు చిన్నాభిన్నమైయ్యాని మంత్రి తుమ్మల అన్నారు. ఃూఒఃఅతోపాటు, నల్గొండ జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసి తీరుతామని తెలిపారు. కుందురు జానారెడ్డి1982 నుంచి రాజకీయాల్లో తన చేయి పట్టుకొని నడిపించారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తన రాజకీయ గురువు జానారెడ్డే అని ఆయన చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లోతనను నిలబెట్టింది జానారెడ్డి అని చెప్పుకొచ్చారు. 12 శాఖల మంత్రిగా పని చేసిన జానా రెడ్డి తన్ను ప్రోత్సహించారని అన్నారు. జానారెడ్డి రాజకీయం అంటే నీతి నిజాయితీ నిబద్ధతతో ఉంటాయని మంత్రి తుమ్మల చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

# అభివృద్ధి ఓరువలేని ప్రతిపక్షాలకు గుణపాఠం తప్పదు

## -కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా
## -నేషనల్ కాంగ్రెస్ వారియర్ జిల్లా అధ్యక్షుడు గజభీంకర్ అశోక్




దుబ్బాక, తెలంగాణ ముచ్చట్లు : అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అడ్డుపడుతున్న ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పుతు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జాతీయ కాంగ్రెస్ వారియర్ జిల్లా అధ్యక్షుడు గజభీంకర్ అశోక్ అన్నారు. బుధవారం నేషనల్ కాంగ్రెస్ వారియర్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నవాజ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో బందీ అయిన తెలంగాణ రాష్ట్రం లో ప్రజా పాలన తో విముక్తి కలిగిందన్నారు . ఇచ్చిన మాట నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , ఉచితంగా గృహ విద్యుత్, రెండు లక్షల వరకు రుణమాఫీ, 500 రూపాయలకి సబ్సిడీ సిలిండర్లును అందిస్తుందని గుర్తు చేశారు . తన నియామకానికి సహకరించిన టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ పన్యాల శ్రవన్ కుమార్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు . కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సేల్ నియోజకవర్గ నాయకులు అందే రాజిరెడ్డి. డిసిసి ప్రధాన కార్యదర్శి కమలాకర్ తదితరులున్నారు.

# సమ్మక్క సారక్కలను దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :అటవీ శాఖ, దేవదాయ ధర్మాదాయ శాఖామాత్యులు మంత్రి కొండా సురేఖ ములుగు జిల్లాలో పర్యటించారు. మేడారం సమ్మక్క సారమ్మలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ– కొండా మురళీధర్ రావు దంపతులతో పాటు వారి కుమార్తె సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్, మనవడు శ్రీయాన్ష్మురళీకృష్ణతో పాటు పలువురు దర్శించు కున్నారు. వనదేవతలకు కుటుంబ సభ్యులతో కలిసి నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు. తమ మనవడి తలనీలాలు సమర్పించిన తర్వాత సమ్మక్క సారక్కల గద్దెల వద్ద మొక్కులు చెల్లించారు. అనంతరం వనదేవతల వద్ద పూజారులు మంత్రి కొండా సురేఖకు అమ్మవారిచీర,పసుపు కుంకుమ లను అందించారు. ఈ తరుణంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరనుజాతీయపండుగగా గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతంగా చేపట్టిందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. అటవీశాఖగా తాను, గిరిజన బిడ్డగా మంత్రి సీతక్క వనదేవతల ప్రాంతం అభివృద్ధి కోసం, సౌకర్యాల కల్పన కోసం నిత్యం కృషిచేస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. తమ కుల దేవతల అయిన సమ్మక్క సారక్కలను ప్రతి సంవత్సరం దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆమె అన్నారు. ఇలా అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతి బాటలో పయనించాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి , కష్టాలను గట్టెక్కాలని మంత్రి కొండా సురేఖ ప్రార్థించారు. రాష్ట్ర ప్రధాత అయిన రాహుల్ గాంధీ, సోనియా గాంధీకి సమ్మక్క సారలమ్మలు శక్తి సామర్థ్యాలు వారికి ప్రసాదించాలని సురేఖ ఆకాంక్షించారు.

# హైకోర్టులోనూ ఐఏఎస్‌లకు చుక్కెదురు

## - టాయించిన రాష్టాల్లో రిపోర్ట్ చేయాల్సిందే
## - ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : అనుకున్నదే అయ్యింది. తెలంగాణలోనే పనిచేస్తామంటూ పట్టుబట్టిన ఆ నలుగురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఊహించని సూచనలు అందజేసింది. వెంటనే కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్ ఐఏఎస్?లు క్యాట్ ఆదేశాలపై హైకోర్టులో లంచ్?మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమ్రపాలి, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, వాణీప్రసాద్‌ల లంచ్ మోషన్ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ ప్రారంభించింది. దాదాపు 2 గంటల విచారణ తర్వాత తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా సదరు అధికారులు తమకు కేంద్రం (డిఓపీటీ) డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే రిపోర్ట్ చేయాలని సూచనలు ఇచ్చింది. మీ అభ్యర్థనపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ అనుకూలమైన తీర్పు ఇవ్వకపోతే కోర్టుకు రావటం సరికాదని తెలిపింది. ఒకవేళ మీ పిటీషన్ డిస్మిస్ చేస్తే మళ్లీ కోర్టుకే వస్తారని, పని చేసేందుకు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లి పని చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. వీటిపై విచారణ తర్వాత చేస్తామని తెగేసి చెప్పేసింది. ఫలితంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అఖిల భారత సర్వీస్ అధికారుల కేటాయింపులపై డీఓపీటీ ఆదేశాలకు అనుగుణంగా అలాటెడ్ రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సిన తప్పని పరిస్థితి నెలకొంది.రొనాల్డ్‌రోస్, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ డీఓపీటీ ఉత్తర్వులపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.తాము ఉన్న క్యాడర్ లోనే పనిచేస్తామని, బదిలీలు లేకుండా కొనసాగించాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. విచారించిన క్యాట్, డీఓపీటీ ఉత్తర్వులను నిలిపేసేందుకు నిరాకరించింది. దీంతో బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి అత్యవసరంగా విచారించాలని కోరారు. ఫలితంగా తీర్పును రిజర్వు చేస్తూ న్యాయస్థానం ప్రత్యేక సూచనలు ఇచ్చింది. మరోవైపు కేటాయించిన రాష్ట్రాల్లో చేరేందుకు డీఓపీటీ గడువు నేటితో తీరనుంది.జస్టిస్ అభినంద్ కుమర్ శావిలి బెంచ్ పిటీషన్లను విచారించింది. కేంద్రం తరఫున న్యాయవాది వాదిస్తూ ఏ అధికారి ఎక్కడ పని చేయాలో చెప్పే అధికారం కోర్టుకు లేదన్నారు.

# వరిధాన్యం కొనుగోళ్ళు- మద్దతు ధర వానాకాలం 204-25

## - కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు శిక్షణా తరగతులు






వానాకాలం 2024-25 సంబంధించిన వరి ధాన్యం సేకరణ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా నిర్వహించేందుకు గాను సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీ పి. శ్రీనివాస్ రెడ్డి గారు, జిల్లాలోని అన్ని వరిధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వహకులకు, మండల వ్యవసాయ & వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణా కార్యక్రమం ను సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో 16.10.2024 ,న నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీ పి. శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, రైతు ఏ దశలోనూ ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిందిగా ఆదేశించారు. జిల్లాలో ఈ ఖరీఫ్ లో సుమారు 3.17లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడం జరిగింది.

మొత్తం దిగుబడి 8,03,530 మెట్రిక్ టన్నుల ధాన్యం, దీనిలో రైతుల అవసరాలు, ఇతరత్రా బహిరంగ కొనుగోళ్ళు పోను 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయుటకై ప్రణాళిక సిద్ధం చేయాలనీ ఆదేశించారు. ఇందులో 3,25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం మిగతా 75,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకం. జిల్లాలో మునుపు సీజను లో వలె 417 కొనుగోళ్ళు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయబడుతందని అన్ని కొనుగోలు కేంద్రాలలో ప్యాడి క్లీనర్లు, వేయింగ్ స్కేల్, మాయిశ్చర్ మీటర్ ,డయల్ కాలిపర్ మరియు టార్పాలిన్లు ఖచ్చితంగా అందుబాటులో ఉండి పనిచేయు స్థితిలో ఉండేలా చూసుకోవాలి అని, కేంద్ర నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు గల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చేలా చైతన్యపరచాలి అని రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి అని సూచించారు. అలాగే సన్నరకం ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందే రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500/- అదనంగా చెల్లిస్తుందని, సన్నరకం ధాన్యంను (66) కొనుగోళ్ళు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయబడుతందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో (32) కొనుగోళ్ళు కేంద్రాళ్ళు ప్రారంభం అయ్యాయి, మిగతా అన్ని కేంద్రాలు కూడా (02) రోజుల్లో ప్రారంభంచేయాలనీ ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను సమకూర్చాలని జిల్లా మేనేజరు పౌర సరఫరా గారిని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం నిలువకై మధ్యంతర గోడౌన్ లను గుర్తించి ధాన్యం, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ధాన్యం భద్రపరాచాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉన్నచో జిల్లా కంట్రోల్ రూం 7995050808 & 7995050809 ను సంప్రదించగలరు. రాష్ట్ర కంట్రోల్ రూం. నెం. 1967 %డ 18004250033 సమావేశంలో డి.ఆర్.డి.వో, డి.సి.యస్.వో, డి.యం. సి.యస్.సి., డి.ఏ.వో డి.సి.వో., కొనుగోలు కేంద్ర నిర్వహకులు, మండల వ్యవసాయ & వ్యవసాయ విస్తరణ అధికారులు ఆర్.టి.వో., డి.ఎ.వో., డి.యం.వో. మరియు మిల్లర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాల్లో 900 మంది



నెల్లూరు (అక్టోబర్ 16) : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంది. జిల్లాకు భారీ వర్షాలు, తుఫాను ముప్పు ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ,వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎ్రా కృష్ణ కాంత్ ముందుగానే జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.దసరా సెలవులకు వెళ్లిన అధికారులు తక్షణమే విధులకు హాజరు కావాలని, సెలవులో ఉన్న వారు సెలవులు రద్దు చేసుకుని రావాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో భారీ వర్షాలు నమోదు కావడంతో జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అందరూ హెడ్ క్వార్టర్స్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి రోజూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేసి దిశా నిర్దేశం చేసారు. అధికారులు గ్రామ స్థాయిలో ఉండటం వల్ల ఇళ్లలోకి నీరు చేరగానే సత్వరమే స్పందించి పునరావాస కేంద్రాలకు చేర్చారు. పునరావాస కేంద్రాల్లో త్రాగునీరు,ఉదయం అల్పాహారం,రెండు పూటలా భోజనం తదితర సౌకర్యాలు కల్పించారు. జిల్లాలో ఇప్పటి వరకు 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 312 కుటుంబాల్లోని 870 మందిని తరలించారు. నెల్లూరు నగరంలో నక్కల సెంటర్ కు చెందిన 80 మందిని పీఎంఆర్ స్కూల్‌కు తరలించారు. నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ బుధవారం వారికి స్వయంగా ఆహారం వడ్డించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్ ఇందుకూరుపేట మండలం గంగ పట్నం పంచాయితీ శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.భోజనం సక్రమం గా అందుతుందో లేదో ఆరా తీశారు.ఇల్లు లేని వారికి పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోని ఆయా డివిజన్లలో =ఐా లు,తహసీల్దార్లు స్వయంగా పర్య వీక్షిస్తున్నారు. ఆత్మకూరు, కందుకూరు, కావలి డివిజన్ పరిధిలో 312 కుటుంబాల్లోని 870 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగింది. ఆత్మకూరు డివిజన్ ఆత్మకూరు మండలంలో బండారుపల్లి గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 5 కుటుంబాలను, అప్పారావుపాలెం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో 15 కుటుంబాలను, కరటంపాడు గ్రామంలో అంగన్వాడి సెంటర్‌లో 15 కుటుంబాలను, అనంత సాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామ మండల పరిషత్ స్కూల్‌లో 17 కుటుంబాలను, ఇనగలూరు పంచాయతీ కార్యాలయంలో ఐదు కుటుంబాలు, చేజర్ల మండలం పెళ్లూరు గ్రామంలో 11 కుటుంబాలను తరలించారు. నెల్లూరు డివిజన్ లోని బుచ్చిరెడ్డిపాలెం మండలం ఇసుక పాలెం గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 38 కుటుంబాలను, ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 5 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. కందుకూరు డివిజన్‌లో ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామంలో సైక్లోన్ సెంటర్‌లో 35 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. అల్లూరు మండలం సింగపేట గ్రామంలో 10 కుటుంబాలు, కావలి డివిజన్ పరిధిలో ముసునూరు కావలి పట్టణంలో మండల పరిషత్ స్కూల్ రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి 141 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ లో 14 కుటుంబాలకు పునరావాసం ఏర్పాటు చేశారు. బుధవారం వరకు జిల్లాలో మొత్తం సుమారు 900 మంది ప్రజలను పునరాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు భోజన సౌకర్యాలు త్రాగునీరు, పాలు,బెడ్షీట్లు తదితర సౌకర్యాలు జిల్లా యంత్రాంగం కల్పించింది.

# సినిమా న్యూస్



# డెనిమ్ షార్ట్ లో అందాల ఈషా




సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే నటి ఈషా రెబ్బా, తాజాగా షేర్ చేసిన ఫోటోలు మరోసారి అభిమానులను ఆకట్టుకున్నాయి. అంటూ క్యాప్షన్ పెట్టిన ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఫోటోల్లో ఈషా సింపుల్ టీషర్ట్, డెనిమ్ షార్ట్ ధరించి, తన ఫిట్‌నెస్ పై కృషిని స్పష్టంగా చూపిస్తున్నారు. ఆ మధ్య జిమ్ లో వర్కౌట్స్ చేసిన తర్వాత తీసిన కొన్ని ఫోటోలు బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఫోటోలలో ఆమె ముఖంపై చెమట కనబడటం, ఫిట్ గా ఉండేందుకు ఆమె ఎంత కష్టపడుతున్నారో చెప్పకనే చెబుతోంది. ఇక ఇప్పుడు అమ్మడు మరోసారి ఆ రేంజ్ లో లెగ్స్ అందాలతో షాక్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. ఈషా తన అందంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో కూడా ఎంతో కసరత్తులు చేస్తోంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ, తన అందంతోనూ, టాలెంట్ తోనూ ఆమె తమిళం సహా ఇతర భాషల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. వెబ్ సిరీస్ లలో నటిస్తూ కొత్త అవెన్యూస్ ను అన్వేషిస్తోంది. అయితే మంచి కాంటెంట్ ఉన్న క్యారెక్టర్ దొరికితే గ్లామరస్ పాత్రలు చేయడానికి ఇబ్బంది లేదని అమ్మడు గతంలోనే క్లారిటీ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఫోటోలతో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ఈషా ఆమధ్య “దయా” అనే వెబ్ సిరీస్ లో డీ గ్లామర్ లుక్ లో కనిపించి ప్రశంసలు అందుకుంది. అందులో నిండు గర్భిణిగా నటించి, తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఇక ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఈషా రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ, అభిమానులను మరింత దగ్గరగా చేసుకుంటుంది. ఈ సారి న్యూ లుక్ లో ఆమె సింప్లిసిటీతో పాటు, ఫిట్‌నెస్ పై ఉన్న ప్రేమను కూడా మరోసారి నిరూపించింది.

# వెజ్-నాన్ వెజ్ కలిపి కుమ్మేస్తోన్న బుట్టబొమ్మ!




ముంబై బ్యూటీ పూజాహెగ్డే వెకేషన్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అమ్మడు వెకేషన్ ఫోటోలు నెట్టింట షేర్ చేసింది. సోలోగా జంగిల్ రిసార్ట్ లో ఎంజాయ్ చేస్తోంది. అక్కడ ప్రతీమూవ్ మెంట్ ని అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా అమ్మడు మరో పిక్ రిలీజ్ చేసింది. ఇందులో సొగసరి కడుపు నింపే కార్యక్రమంపై దృష్టి పెట్టింది. వెజ్-నాన్ వెజ్ అన్నిరకాల వంటకాల్ని కలిపి కుమ్మేస్తోంది. ఎదురుగా ఇష్టమైన వంటకాలన్నింటిని ముందుపెట్టుకుని ఆరగిస్తుంది. పెద్ద డైనింగ్ టేబుల్ పై ఆహార పదార్థాలను ఇక్కడ చూడొచ్చు. వైట్ రైస్...పాపడ్, పీతల కర్రీ, రోటీ, వివిధ రకాల ఫ్రైలు అన్నింటిలోనూ కరివేపాకు దట్టించి మరీ ప్రిపేర్ చేయించుకుంది. అన్నింటిని రుచి వరకూ పరిమితం చేసింది. పూజాహెగ్డే ఇంతవరకూ ఎప్పుడూ ఇలా కనిపించలేదు. తొలిసారి ఓ పెద్ద ప్లేటులో భుజించడం ఇదే తొలిసారి కావచ్చు. ఇలా ఇన్నిరకాల వంటకాలు రుచి చూసే అమ్మడైతే? ప్రభాస్ ఇంట వంటకాలు కూడా రుచి చూసే ఉండాలి కదా. ఇద్దరు కలిసి రాధేశ్యామ్ లో నటించిన సంగతి తెలిసిందే. ప్రభాస్ సినిమాలో నటించిన హీరోయిన్లకు తన ఇంటి భోజనం ఇవ్వడం..ఆయనకు నచ్చిన అన్ని రకాల నాన్ వెజ్ వంటకాలు వండి ఇవ్వడం ఓ అలవాటు. ఇప్పటి వరకూ తనతో పనిచేసిన హీరోయిన్లు అందరికీ తన రుచులు చూపించాడు. మరి అందులో పూజాహెగ్డే ఉందా? లేదా? తెలియాలి. ప్రభాస్ రుచులు చూసిన వారంతా ప్రచార సమయంలో రివీల్ చేసారు. కానీ పూజాహెగ్డే మాత్రం ఎక్కడా ఈ సంగతి చెప్పలేదు.

# టాప్ 5 మిలియన్.. గేమ్ ఛేంజర్ కొడుతుందా?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' మూవీతో 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. మూడేళ్ళ క్రితం మొదలైన ఈ సినిమాపై ప్రస్తుతం చెప్పుకోదగ్గ బజ్ లేదు. అయితే దిల్ రాజు మాత్రం ఈ సినిమాకి వీలైనంత స్ట్రాంగ్ గా హైప్ తీసుకొచ్చే ప్రయత్నం మొదలు పెట్టారు. రెగ్యులర్ గా మూవీ నుంచి ఏదో ఒక అప్డేట్ ఇస్తూ ప్రేక్షకులు 'గేమ్ చేంజర్' మూవీ గురించి మాట్లాడుకునేలా చేయాలని అనుకుంటున్నారు. అలా అయితేనే మూవీ భారీ కలెక్షన్స్ ని అందుకునే ఛాన్స్ ఉంటుంది. స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. నిజానికి ఒకప్పుడు అయితే శంకర్ బ్రాండ్ ఇమేజ్ తోనే ఈ సినిమాకి భారీగా హైప్ వచ్చేసేది. కానీ డైరెక్టర్ శంకర్ కి 'రోబో' తర్వాత ఇప్పటి వరకు ఒక్క హిట్ పడలేదు. చివరిగా వచ్చిన 'భారతీయుడు 2' కూడా బిగ్గెస్ట్ డిజాస్టర్ గా మారింది. దీంతో శంకర్ ఇమేజ్ 'గేమ్ చేంజర్' కి కొంత మైనస్ అయ్యేలా ఉందనే మాట ఇపుడు వినిపిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో మరల బౌన్స్ బ్యాక్ అవ్వాలని శంకర్ 'గేమ్ చేంజర్' అవుట్ పుట్ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారు. అందుకే మూవీ ప్రమోషన్స్ బాధ్యత అంతా దిల్ రాజు చూసుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు 'గేమ్ చేంజర్' ముందు చాలా పెద్ద టార్గెట్ ఉంది. దానిని ఏ మేరకు అందుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఓవర్సీస్ లో 5 మిలియన్ డాలర్స్ కి పైగా కలెక్షన్స్ ని 'గేమ్ చేంజర్' అందుకుంటుందా లేదా అనేది ఇప్పుడందరూ చూస్తున్నారు. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇప్పటి 4 సార్లు 5 మిలియన్ డాలర్స్ కంటే ఎక్కువ కలెక్షన్స్ ని ఓవర్సీస్ లో అందుకున్నారు. 'బాహుబలి 1', 'బాహుబలి 2', 'సలార్', 'కల్కి 2898ఏడీ' సినిమాలు 5 మిలియన్ డాలర్స్ క్లబ్ లో ఉన్నాయి.

# మోక్షజ్ఞ డెబ్యూ.. మరో ఇంట్రెస్టింగ్ లీక్



తెలుగు చిత్ర పరిశ్రమలో నందమూరి ఫ్యామిలీ సుదీర్ఘ కాలంగా ప్రభావాన్ని చూపిస్తూ ముందుకు సాగుతోంది. దీనికి కారణం ఆ కుటుంబం నుంచి ఎంతో మంది హీరోలుగా వచ్చి సత్తా చాటుతుండడమే. ఇప్పుడు ఇదే క్రమంలో మరో నందమూరి వారసుడు కూడా ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. అతడే.. నటసింహ నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ తేజ. నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ తెరంగేట్రం గురించి చాలా రకాల వార్తలు వచ్చాయి. అందులోనూ అతడి మొదటి చిత్రం ఏ దర్శకుడితో ఉంటుంది అన్న దానిపై కూడా చాలా ప్రచారాలు జరిగాయి. ఈ పరిస్థితుల్లోనే నందమూరి మోక్షజ్ఞను ప్రశాంత్ వర్మ ఇంట్రడ్యూస్ చేయబోతున్నట్లు ప్రకటించాడు. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టుపై అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ తెరకెక్కించబోయే సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇటీవలే వచ్చింది. దీన్ని ఎస్ఎల్వీ సినిమాస్, లెజెండ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై నందమూరి తేజస్విని సమర్పణలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉండడంతో పాటు కాస్టింగ్ మీద కూడా ఫోకస్ చేస్తున్నాడు. నందమూరి మోక్షజ్ఞ – ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ క్రేజీ ప్రాజెక్టులో పేరున్న పెద్ద పెద్ద నటీనటులు భాగం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే తాజాగా ఈ చిత్రంలో మోక్షజ్ఞకు తల్లిగా నటించబోయేది ఎవరన్న దానిపై ఓ సమాచారం లీక్ అయింది. దీని ప్రకారం.. ఇందులో హీరో మదర్‌గా సీనియర్ హీరోయిన్ శోభన నటిస్తున్నట్లు తెలిసింది.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.“PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,“CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in